సాక్షి నాగర్‌కర్నూల్


గురువారం । 2 । నవంబర్ । 2023



సీఎంఆర్ ధాన్యం సీజ్

వనపర్తి జిల్లాలో అక్రమంగా వరిధాన్యం తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నారు.

వివరాలు 10లో ▸



నాలుగోసారి ఎవరికో పట్టం

నారాయణపేటలో రెండు సార్లు టీడీపీ, ఒకసారి టీఆర్‌ఎస్ విజయం సాధించాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.4 /17.9

రోజంతా ఆకాశం సాధారణంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ, రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సరిహద్దు చెక్‌పోస్టులో విస్తృత తనిఖీలు



మన్ననూర్: స్థానిక మృగవాణి రెస్టారెంట్ సమీపంలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అనుమతించాలని సూచించారు. చెక్‌పోస్టు వద్ద పోలీసులు, అటవీ, వ్యవసాయ, ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకు అమ్రాబాద్, ఈగలపెంట ఎస్‌ఐలు వీరబాబు, శ్రీనివాసులు నేతృత్వంలో గట్టి నిఘా ఉంచాలన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



కందనూలు: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. ఆన్‌లైన్ లావాదేవీలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ వలకు చిక్కామని భావిస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930, 155260, డయల్ 100కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సైబర్‌సెల్ సీఐపీ శ్రీనివాస్, ఏఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

అటవీ సిబ్బందికి ప్రమాదబీమా



మన్ననూర్: అటవీశాఖలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ప్రమాద బీమా పత్రాలను సంబంధిత అధికారులతో కలిసి పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియాల్ బుధవారం అందజేశారు. బుధవారం పట్టణానికి వచ్చిన ఆయన ఒక్కొక్కరికి రూ.10 లక్షల ప్రమాదబీమా పత్రాలను 240 మంది సిబ్బందికి అందించారు. అంతకుముందు అమ్రాబాద్ అభయారణ్యంలో జంగల్ సఫారీని సందర్శించి నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజ, డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి, విశాల్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీఓ శ్రీనివాస్, తిరుమల్‌రావు, ఎఫ్‌ఆర్‌ఓలు ప్రభాకర్, ఆదిత్య, గురుప్రసాద్, రవి పాల్గొన్నారు.

పదేళ్లలో రాష్ట్రాన్ని లూటీ చేశారు

- కేంద్ర మంత్రి భగవత్ కూబ

పాలమూరు: రాష్ట్రాన్ని కేసీఆర్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు కలిసి లూటీ చేశారని, ఈ పదేళ్లలో వాళ్లు బాగుపడ్డారు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని కేంద్ర మంత్రి భగవత్ కూబ అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటులో కీలకమైన నిధులు, నీళ్లు, నియామకాల గురించి పట్టించుకోకుండా లిక్కర్, మైనింగ్, ఇసుక స్కాంలపైనే దృష్టిసారించారని ఆరోపించారు. రాష్ట్రంలో అర్హులైన దళితులు ఏ ఒక్కరికి కూడా దళితబంధు, అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాలేదన్నారు. పోటీ పరీక్షల పేరుతో పేపర్ లీకేజీ చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటేనని.. ఏ పార్టీకి ఓటేసిన రెండింటికి వేసినట్లే అవుతుందన్నారు. పాలమూరు అసెంబ్లీ సీటును భారీ మెజార్టీతో గెలుస్తామనే పూర్తి విశ్వాసం ఉందని, ఆ దిశగా కార్యకర్తలు పని చేయాలన్నారు. పాలమూరులో కేంద్రం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, జడ్చర్ల నుంచి రాయచూర్ జాతీయ రహదారితోపాటు ఇతర ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందించిందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధిని స్థానిక మంత్రి తాను చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పాలమూరులో ప్రభుత్వ భూములతోపాటు పేదల భూములు సైతం కబ్జా చేస్తూ అక్రమాణాలకు పాల్పడుతున్నారన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పద్మజారెడ్డి, బాలరాజు, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, నారాయణయాదవ్ పాల్గొన్నారు.

పాలమూరులో రాహుల్‌గాంధీ సభలు సక్సెస్

- బీఆర్‌ఎస్, బీజేపీలపై విమర్శలు ఎక్కుపెట్టిన అగ్రనేత
- హస్తం అభ్యర్థులు, శ్రేణుల్లో ఉత్సాహం
- సీఎం, పీఎం నినాదాలతో హోరెత్తిన సభా ప్రాంగణాలు

కాంగిరేసులో జోష్..



కల్వకుర్తి సభకు హాజరైన జనం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్/కల్వకుర్తి/జడ్చర్ల/జడ్చర్ల టౌన్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన రెండు రోజుల పర్యటన ఆ పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపింది. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, బుధవారం కల్వకుర్తిలో బహిరంగ సభతో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల నియోజకవర్గంలో చేపట్టిన కార్నర్ మీటింగ్‌కు జనాలు పోటెత్తారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ అధికార బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ, ఎంఐఎం పార్టీలపై విమర్శనాస్త్రాలు సంధించగా.. హస్తం శ్రేణుల నుంచి విశేష స్పందన లభించింది. దీంతో పాటు తాము అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించి కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను పదే పదే ప్రస్తావించగా.. సభా ప్రాంగణాలు చప్పట్లతో మార్మోగాయి. ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్ట్, భూములు, ధరణి, ఇసుక, మద్యం, కేంద్రంగా బీఆర్‌ఎస్ మంత్రులు, సీఎం కేసీఆర్‌పై రాహుల్ విమర్శలు ఎక్కుపెట్టిన క్రమంలో హస్తం శ్రేణులు కేరింతలతో హల్‌చల్ చేశాయి. తాము అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం, ధరణి లెక్కలు తేల్చాలి కదా.. దోపిడీ సొమ్మును కక్కించి, తిరిగి ప్రజల ఖాతాల్లో జమ చేస్తాం.. ఇక బై బై కేసీఆర్ అని రాహుల్ అనగానే.. సభికులు చేతులు ఊపుతూ ఆయనతో వంతపాడారు.

జంగ్ తెలంగాణ

కాంగ్రెస్‌తోనే ప్రజల కల సాకారం

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కారు ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని, కాంగ్రెస్ వస్తేనే పేదల కల సాకారమవుతుందని రాహుల్‌గాంధీ అన్నారు. రాష్ట్రంలోని ముఖ్యమైన శాఖలన్నీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యుల వద్దే ఉన్నాయన్నారు. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ ఇప్పటికే అప్పుల ఊబిలోకి నెట్టివేశారని, 2040 వరకు ఒక్కొక్కరిపై ఏటా రూ.లక్షకుపైగా అప్పు భారాన్ని మోపారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో దళిత, గిరిజన, బడుగులకు ఇచ్చిన భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కొంటుందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు రూ.2,500, కేవలం రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. తాను స్వయంగా జిల్లెలలో వృద్ధులతో మాట్లాడానని, ఇప్పుడు రూ.2 వేలు మాత్రమే వస్తున్నాయని చెప్పగా.. తాము అధికారంలోకి వచ్చాక నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తామని భరోసా ఇచ్చానన్నారు.

■ సభల్లో రాహుల్ తన ప్రసంగాల చివరలో జడ్చర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జనంపల్లి అనిరుధ్ రెడ్డి, దేవరకద్ర అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి, కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రజలకు పరిచయం చేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

■ జడ్చర్లలోని అంబేద్కర్ చౌరస్తా జనసందోహంతో నిండింది. మీటింగ్‌కు వచ్చే ప్రజలు పాతబస్టాండ్ రోడ్ వైపు ఉండేలా ఏర్పాట్లు చేశారు. అయితే కల్వకుర్తి మార్గం వైపు అధిక సంఖ్యలో జనం వచ్చారు. దీంతో రాహుల్ మొదట పాత బస్టాండ్ వైపు తిరిగి ప్రసంగించినా.. కల్వకుర్తి మార్గంలో ఎక్కువ ప్రజలు ఉండటంతో ఎక్కువగా అటువైపు తిరిగి మాట్లాడారు.

■ కల్వకుర్తి సభ, జడ్చర్ల కార్నర్ మీటింగ్‌లో రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల, దేవరకద్ర ఎమ్మెల్యే అభ్యర్థులు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రబ్బాని, మాజీ ఎంపీపీ నిత్యానందం, నాయకులు అశోక్‌యాదవ్, బుక్కవెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్, విజయకుమార్ రెడ్డి, ఆనంద్‌కుమార్, సంజీవ్‌యాదవ్, భూపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

■ సభికుల్లో ఉన్న రామేశ్వరమ్మ అనే వృద్ధురాలి పేరును రాహుల్ అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆమె పేరును ప్రస్తావిస్తూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం వృద్ధాప్య పింఛన్‌ను ప్రతి ఒక్కరికి ప్రతి నెలా రూ.4 వేలు అందిస్తామంటూ తల్లులకు భరోసా కల్పించారు.

కాంగ్రెస్ సునామీలా వస్తోంది: మల్లురవి

తెలంగాణలో కాంగ్రెస్ సునామి, తుపాన్‌లా దూసుకువస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. తాము ఊహించిన దానికన్నా ప్రజలనుంచి సానుకూలత అధికంగా ఉందన్నారు. కార్నర్ మీటింగ్‌కు వచ్చిన ప్రజలను చూస్తే అనిరుధ్‌రెడ్డికి 50 వేల ఓట్ల మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. రాష్ట్రంలో 90 నుంచి 100 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కల్వకుర్తికి ప్రత్యేక స్థానం రేవంత్



ఉమ్మడి రాష్ట్రంలోనే కల్వకుర్తి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడి నుంచే జైపాల్ రెడ్డి ఢిల్లీస్థాయిలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కీర్తి గడించారని గుర్తుచేశారు. ద్యాప గోపాల్‌రెడ్డి, వంశీచంద్ రెడ్డితో పాటు ఇక్కడే జెడ్పీటీసీగా గెలుపొందిన తనకు రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వార్డు మెంబర్ పదవిని కూడా ఎవరూ వదులుకోరని, అలాంటిది వంశీచంద్‌రెడ్డి పార్టీ గెలుపు కోసం ఎమ్మెల్యే సీటును త్యాగం చేశారని కొనియాడారు. పార్టీలోని వర్గాలన్నీ ఏకమై కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని గెలిపించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని 14 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి చేస్తా కసిరెడ్డి



ఇనాళ్లు ఎమ్మెల్సీగా ఉన్నా ప్రజలకు ఏమి చేయకపోయానని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎమ్మెల్సీగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని, అసమర్థులుగా ఉండలేకనే కాంగ్రెస్‌లోకి వచ్చానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నిద్రావస్థలో ఉండటంతో కల్వకుర్తి అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి టికెట్ త్యాగం చేసి తనకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత రైతు కుటుంబానికి రాహుల్ పరామర్శ

- కల్వకుర్తి మండలం జిల్లెలలో చంద్రయ్య కుటుంబసభ్యులతో భేటీ
- వ్యవసాయ పొలం వరకు నడిచివెళ్లిన కాంగ్రెస్ అగ్రనేత
- వారి పొలాన్ని సాగుకు యోగ్యంగా మలచాలని కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి సూచన



తిరుపతమ్మతో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

- వివరాలు 10లో

■ జడ్చర్లలోని అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బస్సు టాప్‌పై నుంచి రాహుల్ ప్రసంగించారు. టాప్‌పైకి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, రాహుల్ గాంధీ వస్తున్న క్రమంలో శ్రేణుల నుంచి సీఎం.. పీఎం నినాదాలు హోరెత్తాయి.



జడ్చర్ల కార్నర్ మీటింగ్

విద్య, ఉపాధి కల్పనకు కృషి

- ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి.. చిత్రంలో ఎంపీ రాములు తదితరులు

నాగర్‌కర్నూల్: అత్యధిక యువ సంపద కలిగిన దేశం మనదని.. యువత సంకల్పిస్తే దేశం అన్నిరంగాల్లో ముందుంటుందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వెలమ ఫంక్షన్‌హాల్ పక్కన నిర్వహించిన మర్రి యువ సమ్మేళనానికి యువత అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. యువత హీరోలు, నాలుగు పెళ్లిళ్లు చేసుకున్న వారికి ఫ్లెక్సీలు కట్టడం కాదని.. ఆటోగ్రాఫ్‌లు తీసుకునే స్థాయి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరారు. కందనూలు బాగుండాలంటే యువత పెద్దసంఖ్యలో తనకు మద్దతు పలకాలని.. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాల, ఐటీ హబ్, అలాగే 2 వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిమ్మాజిపేట యువత గురించి వివరిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. తను చదువుకోకపోయినా తన తమ్ముళ్లు చదువుకోవాలనే ఉద్దేశంతో ట్రస్ట్ ద్వారా పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎంపీ రాములు మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న మర్రి జనార్దన్‌రెడ్డిని ముచ్చటగా మూడోసారి గెలిపించాలని కోరారు. అంతకుముందు యువతలో స్ఫూర్తి నింపేలా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు పలు అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బైకాని శ్రీనివాస్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారు

- ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రతిపక్ష పార్టీల నేతలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని.. వారికి సరైన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసం వద్ద నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణాలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని వివరించారు. అచ్చంపేట ప్రాంతానికి పరిశ్రమలు తీసుకొచ్చి వలసల నివారణకు కృషి చేస్తానన్నారు. నవంబర్ 5న హైదరాబాద్‌లో నిర్వహించే 'హైదరాబాద్‌లో అచ్చంపేట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అచ్చంపేట ప్రాంతానికి చెందిన ఓటర్లు నాగోల్‌లోని అనంతుల రాంరెడ్డి గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ అరుణ, ఎంపీపీ శాంతాబాయి, నాయకులు తులసీరాం, రాజేశ్వర్‌రెడ్డి, విష్ణుమూర్తి, లోక్యానాయక్, అమీనుద్దీన్, లాలూయాదవ్, నర్సయ్యయాదవ్, గోపాల్‌నాయక్, సతీష్, ఆనంద్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కొల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని కొల్లాపూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్ సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని.. ఎన్నికల అఫిడవిట్‌లో అన్ని వివరాలు నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ప్రభుత్వ బకాయిలు ఉండకూడదని.. నామినేషన్‌కు జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.5 వేలు జమ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు జతపర్చాలని తెలిపారు. ప్రచారాలు, సభలు, మైకులకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, అన్నింటికి సంబంధించిన రసీదులను సమర్పించాలన్నారు. రోజువారీగా ఖర్చుల వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతినిధుల పలు సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు, బీఆర్‌ఎస్ నాయకులు కాటం జంబులయ్య, పోతుల వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకుడు యూసూఫ్, సీపీఎం నాయకుడు శివవర్మ, బీఎస్పీ నాయకుడు పోతుగంటి బాలకృష్ణుడు, బీజేపీ నాయకుడు సాయికృష్ణగౌడ్‌తో పాటు ఏఈఆర్‌ఓ శ్రీకాంత్, తహసీల్దార్లు ఎక్బాల్, సరస్వతి, రమాబాయి, ఎస్‌ఐ బాలవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



అచ్చంపేటలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

అచ్చంపేట: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం అచ్చంపేట రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. మండలాల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అక్టోబరు 19 తర్వాత వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. తనిఖీ సమయంలో వీడియో చిత్రీకరణ చేపట్టాలని తెలిపారు. 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతునందున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించి ఎన్నికల ఖర్చు వివరాల నిబంధనలు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపీరాం, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

విద్యార్థినులు స్వీయ రక్షణతో పాటు కష్టపడి చదివి సమాజంలో ఉన్నత స్థానంలో నిలవాలని, అప్పుడే గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని బాలసదన్‌లో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. బాలసదన్‌లో చదువుతున్న అనాథ విద్యార్థినుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ ఆధార్, కుల, ఆర్థిక ధ్రువీకరణ పత్రాలను అందించాలని ఆర్డీఓ గోపీరాం ఆదేశించారు. అలాగే బాలికలు ప్రదర్శించిన స్వీయ రక్షణ కార్యక్రమాలను వీక్షించారు. విద్యార్థినులతో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేసి మాట్లాడారు. బాలసదన్‌లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ అధికారిణి వెంకటలక్ష్మి, సీడబ్ల్యూసీ చైర్మన్ లక్ష్మణరావు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీశైలం, సీడీపీఓ దమయంతి, సఖి కో–ఆర్డినేటర్ సునీత, ఉమెన్ హబ్ కో–ఆర్డినేటర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన..

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రం సమీపంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన కౌంటింగ్, ఈవీఎంల సేకరణ కేంద్రాన్ని బుధవారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల నుంచి ఈవీఎంలు ఇక్కడికే వస్తాయని.. కౌంటింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన, కట్టుదిట్టమైన ఏర్పాట్లు 10వ తేదీలోపు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటర్‌నెట్, మీడియా పాయింట్, బారికేడ్లు, విద్యుత్, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సీతారామరావు, నాగర్‌కర్నూల్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, డీపీఆర్‌ఓ సీతారాం, పుర కమిషనర్ జయంత్‌కుమార్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'కురుమూర్తి' జాతరకు ప్రత్యేక బస్సులు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి జాతరకు మహబూబ్‌నగర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. బుధవారం స్వామివారి జాతర మైదానంలో బస్సులను నిలిపేందుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు, సిబ్బంది ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 14న ప్రారంభం కానున్న కురుమూర్తిస్వామి ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బస్సులు నడిపిస్తామని, భక్తులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డితో పలు అంశాలపై చర్చించారు. ఆమె వెంట మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సుజాత, రీజినల్ సీఐ భాను ఉన్నారు.

పాలెం కేవీకేలో కిసాన్‌మేళా

బిజినేపల్లి: మండలంలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు కేవీకే కో–ఆర్డినేటర్ డా. ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి కొనసాగే మేళాలో యాసంగిలో వేరుశనగ, వరి, మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం, ఆధునిక వ్యవసాయ యంత్రాల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

నాలుగోసారి ఎవరికో పట్టం?

- 2009లో నారాయణపేట నియోజకవర్గం ఏర్పాటు
- రెండుసార్లు టీడీపీ.. ఒకసారి బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం
- 2009లో నారాయణపేట నియోజకవర్గం ఏర్పాటు
- టీడీపీ తొలి ఎమ్మెల్యేగా ఎల్కోటి ఎల్లారెడ్డి
- ఆ తర్వాత ఎస్.రాజేందర్‌రెడ్డి గెలుపు



నారాయణపేట నియోజకవర్గం చిత్రపటం

నారాయణపేట: నియోజకవర్గ పునర్విభజనలో 2009లో నారాయణపేట నియోజకవర్గంగా ఆవిర్భవించింది. అసెంబ్లీ ఎన్నికల బరిలో ప్రధాన పార్టీల తరఫున అభ్యర్థులు పోటీచేయడం సర్వసాధారణం. ఇప్పటి వరకు మూడుసార్లు ఎన్నికలు జరిగితే రెండు సార్లు టీడీపీ, మూడోసారి బీఆర్ఎస్ విజయం సాధించాయి.

నియోజకవర్గ స్వరూపం

2009 కంటే ముందు నారాయణపేట పట్టణంతో పాటు మండలం, దామరగిద్ద, ధన్వాడ, మద్దూర్ మండలాల్లోని పలు గ్రామాలు మక్తల్ నియోజకవర్గ పరిధిలో ఉండేవి. నారాయణపేట నియోజకవర్గం ఏర్పడడంతో నారాయణపేట పట్టణం, మండలం, ధన్వాడ, కోయిల్‌కొండ, దామరగిద్ద మండలాలతో నారాయణపేట నియోజకవర్గం ఏర్పడింది. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న కోయిలకొండ నారాయణపేట నియోజకవర్గంలోకి చేర్చారు. 2016లో కొత్త జిల్లాల ఏర్పాటుతో నారాయణపేట నియోజకవర్గం మహబూబ్‌నగర్‌లోనే ఉండేది. 2019 ఫిబ్రవరి 17న సీఎం కేసీఆర్ జన్మదిన కానుకగా నారాయణపేటను జిల్లాగా ఏర్పాటు చేశారు. దీంతో కోయిలకొండ మండలం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉండిపోయింది. నారాయణపేట జిల్లా కావడంతో ధన్వాడ మండలంలో మరో కొత్త మండలం మరికల్ ఏర్పాటైంది. ప్రస్తుతం నియోజకవర్గం నారాయణపేట పట్టణం, మండలం, ధన్వాడ, మరికల్, దామరగిద్ద మండలాలతో పాటు కోయిలకొండ మండలం ఉంది.

పేటకు తొలి ఎమ్మెల్యే ఎల్లారెడ్డి



2009 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రమంతటా వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ గాలివీస్తే మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూర్ మండలానికి చెందిన మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి నారాయణపేట నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున తొలిసారి పోటీ చేసి విజయం సాధించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించడంతో ఈ ప్రాంత ఓటర్లదీ విలక్షణ తీర్పు అంటూ రాజకీయ పరిశీలకులు భావించారు.

రెండు సార్లు రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యే



2014లో సాధారణ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎల్లారెడ్డికి టీడీపీ టికెట్ ఇవ్వకుండా కోయిలకొండ మండలంలోని శేరి వెంకటాపూర్‌కు చెందిన ఎస్.రాజేందర్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంతో టీఆర్ఎస్ అభ్యర్థి కుంభం శివకుమార్‌రెడ్డి పై 2,270 స్వల్ప ఆధిక్యతతో గెలుపొందారు. 2014 జూన్2 తర్వాత తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావించడంతో రాజకీయ పరిణామాలతో నారాయణపేట నియోజకవర్గమే అభివృద్ధే లక్ష్యంతో ఫిబ్రవరి 11, 2016న సీఎం కేసీఆర్ సమక్షంలో ఎస్.రాజేందర్‌రెడ్డి గూలాబీ గూటికి చేరారు. ఆ తర్వాత 2018లో టీఆర్ఎస్ తరఫున పోటీచేసిన ఈయన మళ్లీ బీఎల్ఎఫ్ అభ్యర్థి శివకుమార్‌రెడ్డిపై 15,187 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బీఆర్ఎస్ తరఫున రాజేందర్‌రెడ్డి రంగంలోకి దిగారు.

నారాయణపేట నియోజకవర్గం

మండలాలు : దామరగిద్ద, నారాయణపేట, మరికల్, ధన్వాడ, కోయిలకొండ.

మున్సిపాలిటీ : నారాయణపేట టౌన్


భౌగోళిక స్వరూపం : వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో నారాయణపేట నియోజకవర్గం. దామరగిద్ద, నారాయణపేట మండలాలు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. కోయిలకొండ మండలం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది.

ప్రభావితం చేసే వర్గాలు:
ముదిరాజ్, ముస్లిం మైనార్టీలు, పద్మశాలి, స్వకున్ సాలి, క్షత్రియ సమాజ్, గీతకార్మికులు.

ప్రసిద్ధ ఆలయాలు:
నారాయణపేట మండలంలోని ఎక్లాస్‌పూర్ బాలాజీ దేవాలయం, లోకయాపల్లి లక్ష్మమ్మ, కోయిలకొండలోని శ్రీరామకొండ.

ప్రధాన విద్యా సంస్థలు:
అన్ని మండలాల్లో కస్తూర్బ పాఠశాలలు, నియోజకవర్గంలో ఒక్కొక్కటి చొప్పున మైనార్టీ, బీసీ, ఎస్సీ, బాలుర, బాలికల గురుకులాలు. ధన్వాడలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నారాయణపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల. ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు.

పర్యాటకం:
నారాయణపేట మండలంలోని ఎక్లాస్‌పూర్ అటవీప్రాంతంలో నిర్మించిన ఏకోపార్కు.



వలసలంటేనే నారాయణపేట

పొట్టకూటి కోసం పిల్ల, జల్లలతో దశాబ్దాలుగా జీవనోపాధి కోసం ముంబాయి, పుణే, హైదరాబాద్ నగరాలకు వలసలు వెళ్లడమే ఈ ప్రాంత కూలీలు, రైతులకు ఏకైక మార్గం. నారాయణపేట నియోజకవర్గంలో దామరగిద్ద, నారాయణపేట మండలంలోని గ్రామాల్లో రైతులు దాదాపు గ్రామాలు మెట్ట ప్రాంతంలో ఉండడంతో ఏటా వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తారు. వర్షాభావంతో ఎండిపోవడం, దిగుబడి తగ్గుతున్న దుస్థితని ఇక్కడి రైతులు ఎదుర్కొంటున్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం విడతల వారీగా మిషన్‌కాకతీయతో చెరువులను మరమ్మతులు చేపట్టడంతో వానాకాలం కురిసే వానలకు నిండి పొంగిపొర్లుతున్నాయి. భూగర్భజలాలు సైతం పెరగడంతో కాస్తా వలసలు తగ్గుముఖం పట్టాయని చెప్పవచ్చు.

నారాయణపేట నియోజకవర్గం పోల్ గ్రాఫ్

పోల్ గ్రాఫ్	2009	2014	2018
పోలైన ఓట్లు	1,22,097	1,36,831	1,61,910
మెజార్టీ	12,143	2,279	15,187
గెలుపొందిన అభ్యర్థి	వై.ఎల్లారెడ్డి	ఎస్.రాజేందర్‌రెడ్డి	ఎస్.రాజేందర్‌రెడ్డి
వచ్చిన ఓట్లు	45,945 (37.66 %)	40,107 (29.37%)	68,767 (42.51%)
సమీప ప్రత్యర్థి	సుగప్ప	కె.శివకుమార్‌రెడ్డి	కె.శివకుమార్‌రెడ్డి
వచ్చిన ఓట్లు	33,802 (27.72%)	37,837 (27.71%)	53,530 (33.12%)

2014లో రెండవసారి టీడీపీ ఎమ్మెల్యే ఎస్.రాజేందరరెడ్డి

అభ్యర్థి	పార్టీ	వచ్చినఓట్లు	ఓటింగ్‌శాతం
ఎస్.రాజేందర్‌రెడ్డి	టీడీపీ	40,107	29.37
కె.శివకుమార్‌రెడ్డి	టీఆర్ఎస్	37,837	27.71
కృష్ణ వామన్‌గారి	కాంగ్రెస్	29,278	21.44
కె.రతంగ్‌పాండురెడ్డి	స్వతంత్ర	23,591	17.28

2018లో రెండవసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎస్.రాజేందర్‌రెడ్డి

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	ఓటింగ్‌శాతం
ఎస్.రాజేందర్‌రెడ్డి	టీఆర్ఎస్	68,767	42.51
కె.శివకుమార్‌రెడ్డి	బీఎల్ఎఫ్‌పీ	53,580	33.12
కె.రతంగ్‌పాండురెడ్డి	బీజేపీ	20,111	12.43
కృష్ణ సరాఫ్	కాంగ్రెస్	6,344	3.92

ప్రభావం చూపే అంశాలు

ఓటర్లలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. జయమ్మ చెరువుకు నీరు అందించాలని ఈ ప్రాంత రైతుల ఆకాంక్ష. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ద్వారా సాగునీరు అందిస్తామని చెబుతుంది. కృష్ణా, వికరాబాద్ రైల్వేలైన్ పైనే ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఎజెండగా ముందుకు సాగుతారు. చేనేతకు ప్రసిద్ధి కావడంతో చాలీచాలని ఆదాయంతో మరమగ్గాల కార్మికులు జీవనం సాగిస్తున్నారు.

రాహుల్‌గాంధీ పర్యటన ఇలా..



ట్రాక్టర్లలో సభకు తరలివస్తున్న ప్రజలు

రాహుల్‌గాంధీ కల్వకుర్తి సభకు భారీ సంఖ్యలో జనం తరలి వచ్చారు.

- రోడ్డు మార్గంలో రాహుల్ గాంధీ వెల్దండ మీదుగా కల్వకుర్తికి చేరుకున్నారు.
- సభ ప్రాంగణానికి మధ్యాహ్నం 3:12 గంటలకు చేరుకున్నారు.
- రాహుల్ గాంధీ 3:38గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించారు.
- అరగంట పాటు ప్రసంగించారు.
- రైతులు రాహుల్‌గాంధీకి నాగలి బహూకరించారు.
- రేవంత్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్లు చెప్పగా కార్యకర్తలు పెద్ద ఎత్తున్న చప్పట్లు కొట్టారు.
- రాహుల్‌గాంధీ 4:20 గంటలకు సభస్థలి నుంచి తిరిగి వెళ్లారు.
- కల్వకుర్తి పట్టణం జనంతో కిటకిటలాడింది.
- జడ్చర్ల కార్నర్ మీటింగ్‌కు రాహుల్‌గాంధీ సాయంత్రం 5:07గంటలకు చేరుకున్నారు.
- సభ సాయంత్రం 5:46 గంటల వరకు కొనసాగింది.
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రసంగించకపోవటం సభికుల్లో అసంతృప్తి కనిపించింది.
- రాహుల్ ప్రసంగాన్ని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలుగులో అనువాదం చేశారు.
- రాహుల్ ప్రసంగం 34నిమిషాలు కొనసాగింది.
- మైక్‌లు ఒకవైపు మాత్రమే ఏర్పాటు చేయటంతో కల్వకుర్తి మార్గం వైపు ఉన్న వారికి ప్రసంగం వినిపించకపోవటంతో విషయాన్ని రాహుల్ దృష్టికి తీసుకువచ్చారు.
- స్పందించిన రాహుల్ మైక్‌లను అటు తిప్పాలని సూచించారు.
- దూరంగా ఉన్న వారందరిని ముందుకు రానివ్వాలని, బారికేడ్లు తొలగించాలని పోలీసులను కోరారు.
- ఒక్కసారిగా ప్రజలు బస్సువద్దకు దూసుకువచ్చాక రాహుల్ తన ప్రసంగాన్ని కొనసాగించారు.
- తమది జనతా సర్కార్ అని అందుకే మీ అందరిని ముందుకు రానిచ్చామని, అదే కేసీఆర్ సభ అయితే ప్రజలను దూరంగా ఉంచుతారని ఉదహరించారు.
- కార్నర్ మీటింగ్‌కు ప్రజలు రానివ్వకుండా బస్సులను క్లబ్‌రోడ్డు, ఇతర మార్గాల్లో దూరంగా నిలిపివేశారని అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు.
- రాహుల్ మీటింగ్ ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా కొనసాగింది.
- సభ ప్రాంగణం కాంగ్రెస్‌జెండాలతో నిండిపోయింది.
- సాయంత్రం 4:50గంటల వరకు సభ ప్రాంగణంలో జనం పెద్దగా లేకపోవటంతో నిర్వాహకులు ఒకింత ఆందోళనకు గురయ్యారు.
- రాహుల్ వచ్చే కొద్ది సమయానికి ముందే ప్రజలు ఒక్కసారిగా తరలిరావటంతో కిటకిటలాడింది.
- కల్వకుర్తి నుంచి కారులో వచ్చిన రాహుల్ నేరుగా బస్సుపైకి ఎక్కి ప్రసంగాన్ని ప్రారంభించారు.
- రేవంత్‌రెడ్డి బస్సుపైకి చేరుకున్న సమయంలో సీఎం.. సీఎం.. అంటూ అభిమానులు నినదించారు.

నాడు సూర్య దాబా.. నేడు చాయ్ క్లబ్



జడ్చర్ల సమీపంలో చాయ్‌క్లబ్‌లో టీ తాగుతున్న రాహుల్‌గాంధీ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అనుకోకుండా రెండు సందర్భాల్లో జడ్చర్లలో చాయ్ తాగడం చర్చనీయాంశంగా మారింది. 2008లోనూ మండలంలోని మాచారం వద్ద జాతీయ రహదారిపై సూర్య ఫ్యామిలీ దాబాలో చాయ్ తాగగా.. బుధవారం జడ్చర్ల సమీపంలో చాయ్ క్లబ్‌లో మరోసారి టీ రుచి చూశారు. కల్వకుర్తి సభ ముగియగానే వాహనాల్లో జడ్చర్ల కార్నర్ మీటింగ్‌కు వస్తూ మార్గమధ్య పట్టణ శివారులోని చాయ్ క్లబ్ వద్ద అకస్మాత్తుగా ఆగి చాయ్ క్లబ్‌లోకి వెళ్లి సేదతీరారు. ముఖ్య నాయకులతో మాట్లాడుతూ సమోస, చికెన్ రోల్స్, బిస్కెట్స్ తిని చాయ్ తాగారు. చాయ్ బాగుందని మరోసారి తెప్పించుకుని తాగడం విశేషం.

- జడ్చర్ల/జడ్చర్ల టౌన్

బాధిత రైతు కుటుంబానికి రాహుల్ పరామర్శ

- కల్వకుర్తి మండలం జిల్లెలలో చంద్రయ్య కుటుంబసభ్యులతో రాహుల్ భేటీ
- అర కి.మీ. దూరంలో ఉన్న వ్యవసాయ పొలం వరకు నడిచివెళ్లిన రాహుల్
- వారి పొలాన్ని సాగుకు యోగ్యంగా మలచాలని కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డికి సూచన

సాక్షి, నాగర్‌కర్నూల్/కల్వకుర్తి: పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటన సందర్భంగా అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఓ రైతు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పలకరించారు. కల్వకుర్తి మండలం జిల్లెలకి చెందిన రైతు చంద్రయ్య అప్పులకు తాళలేక మూడేళ్ల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి పెద్దను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబం ఇంటికి రాహుల్ స్వయంగా వెళ్లి మాట్లాడారు. చంద్రయ్య భార్య తిరుపతమ్మ, కొడుకు నితిన్‌ను పలకరించారు. వారి ఇంటి నుంచి అర కి.మీ. దూరంలో ఉన్న వారి వ్యవసాయ పొలాన్ని రాహుల్ నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. తిరుపతమ్మ పొలంలో బోరు ఏర్పాటు చేయించి, దున్నించి సాగుకు అనుగుణంగా మార్చాలని కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి రాహుల్ సూచించారు.

రాహుల్, చంద్రయ్య కుటుంబసభ్యులతో జరిగిన సంభాషణ వారి మాటల్లోనే..



కల్వకుర్తి మండలం జిల్లెలలో తిరుపతమ్మ , ఆమె కొడుకు నితిన్‌తో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

రాహుల్: మీ భర్త ఎలా చనిపోయారు?
తిరుపతమ్మ: మాకు 28 కుంటల భూమి ఉంది. నీళ్లు లేవు. దీంతో రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తిసాగు చేశాం. పంట సరిగ్గా పండక, దిగుబడి రాక రూ.2 లక్షల అప్పు అయ్యింది. అప్పుతీర్చే మార్గం లేక పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు సార్.
రాహుల్: మీకు ఉన్న భూమిలో పంట వేశారా?
తిరుపతమ్మ: భూమికి నీటి సౌకర్యం లేదు. కాల్వ నీళ్లు రావు. బీడుగానే ఉంది సార్.
రాహుల్: బోరు వేయించి భూమి సాగులోకి వచ్చేలా చూసే బాధ్యత మాది. ధైర్యంగా ఉండండి.
రాహుల్: బేటా నితిన్..ఏమి చదవుకున్నావు. ఏమి పని చేస్తున్నావు.
నితిన్: సార్ పదో తరగతి వరకు చదువుకున్నా. కల్వకుర్తిలోని టిఫిన్ సెంటర్‌లో పని చేస్తున్నా. అమ్మ ఇళ్ల నిర్మాణానికి మేస్త్రీ పని వద్దకు వెలుతుంది.
రాహుల్: నీకు దేనిపై ఆసక్తి ఉంది. ఏమి కావాలని అనుకుంటున్నావు.
నితిన్: టిఫిన్ సెంటర్ పెట్టాలని అనుకుంటున్నా సార్.
రాహుల్: డ్రైవింగ్ నేర్చుకొని వాహనం నడపగలవా? అందుకు ఏర్పాట్లు చేస్తా.
నితిన్: చేస్తాను సార్.

2 లారీల సీఎంఆర్ ధాన్యం సీజ్



పట్టుబడిన ధాన్యంతో అధికారులు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లాలో రైతులతో ప్రభుత్వం సేకరించిన వరి ధాన్యాన్ని జిల్లాలోని పలు రైసు మిల్లర్లకు అప్పగించారు. వాటిని మిల్లర్లు మిల్లు ఆడించి ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వాలి. కొందరు మిల్లర్లు సీఎంఆర్‌కు ఉపయోగించకుండా ఆ ధాన్యాన్ని ఎక్కువ ధరలకు పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. మంగళవారం రాత్రి వనపర్తి మండలంలోని చిట్యాల శివారులోని రైస్ మిల్ గోదాం నుంచి 1,190 బ్యాగుల వరి ధాన్యం రూ9,80,560 విలుల గల రెండు లారీలలో తరలిస్తున్న క్రమంలో పెబ్బేరు మున్సిపాలిటీ వద్ద మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డిప్యూటీ తహసీల్దార్ ఫరిదాబేగం చేరుకుని పరిశీలించి సీఎంఆర్ ధాన్యంగా గుర్తించి సీజ్ చేశారు. ధాన్యం తరలిస్తున్న పాండు, తెలుగు తిమ్మప్ప, మిల్లు యజమాని మారం బాలకృష్ణ, లారీ డ్రైవర్లు సాధిక్, రఫియోద్దీన్‌లపై కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

గోపాలపేట: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. రేవల్లి ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఎద్దుల లక్ష్మయ్య (53) పొలం పనులు చేసుకుని జీవనం కొనసాగించేవాడు. అతడికి భార్య చంద్రకళ ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉండగా అందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. కొంతకాలంగా ఇంట్లో గొడవలు అవుతున్నాయి. ఇదే క్రమంలో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఎప్పటిలాగే పొలందగ్గరికి వెళ్లాడు. ఆ తర్వాత కూతురు ముత్యాలుకు ఫోన్ చేసి మీరంతా సంతోషంగా ఉండండి అని మాట్లాడాడు. ఎందుకలా మాట్లాడుతున్నావు నాన్నా అని అడగగా అంతలోనే కట్ చేశాడు. అప్పటి నుంచి వెతకగా ఎక్కడా ఆచూకీ లభించలేదు. ఉదయం 8గంటల ప్రాంతంలో వారి సొంత పొలం దగ్గర కుటుంబ సభ్యులకు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. లక్ష్మయ్య కూతురు ముత్యాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని యువకుడు..

కేటీదొడ్డి: భార్య కాపురానికి రాకపోవడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఇర్కిచేడుకు చెందిన సంగీతను నీలహళ్లికి చెందిన వీరేష్‌తో ఏడాది క్రితం వివాహమైంది. జీవనోపాధికి హైదరాబాద్‌లో పండ్ల వ్యాపారం చేసేవారు. దసరా సందర్భంగా నీలహళ్లికి వచ్చారు. అక్కడ నుంచి సంగీతను తల్లిదండ్రులు ఇర్కిచేడుకు తీసుకెళ్లారు. పండుగ అయిపోయింది.. హైదరాబాద్ వెళ్దామని భర్త అడగగా, వారు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెంది అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా ఎంతకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు వాకాబు చేసిన ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి పుల్లమ్మ కుమారుడు కనబడటం లేదని కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుధవారం మండలంలోని కొండాపురం రైల్వేస్టేషన్ పక్కన వ్యవసాయ పొలంలో కుర్వ వీరేష్ (25) చెట్టుకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా కుర్వ వీరేష్‌గా గుర్తించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట శివారులో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాచారంపేటతండాకు చెందిన మంగమ్మ(37) భర్త, ముగ్గురు పిల్లలతో కలిసి కొత్తకోటలోని ఎన్టీఆర్ కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం గడిపేది. ఏమైందో తెలియదు కానీ కనిమెట్ట సమీపంలో బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా స్థానికుల సమాచారంతో 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్ ప్రారంభం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి మంగళవారం సాయంత్రం వరకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 116, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,517 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.401 టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అమరచింతలో మొసలి కలకలం

అమరచింత: పట్టణ శివారులో బుధవారం మొసలి సంచరించడం కలకలం రేపింది. బుధవారం తెల్లవారుజామున పెద్ద చెరువు నుంచి సమీప పొలాల వెంట మొసలి చింతలకుంట వైపు వస్తుండగా యువకులు గమనించి తాళ్లతో బంధించారు. విషయాన్ని స్నేక్ సాగర్ సొసైటీకి సమాచారం ఇవ్వడంతో కృష్ణసాగర్ చేరుకోని బంధించారు. డీఎఫ్ఓ నవీన్‌కుమార్ ఆదేశాలతో పట్టుకున్న మొసలిని జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో వదిలేశారు. ఈమేరకు కృష్ణసాగర్ మాట్లాడుతూ 10 అడుగుల పొడవు 300 వందల కేజీల బరువుగల మొసలి సంచరించడం అరుదన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని చెరువులను కాల్వల ద్వారా నింపడంతో మొసళ్లు చెరువుల్లో చేరుకుంటున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొసలి సంచారం కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.



అమరచింతలో బంధించిన మొసలి

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
- Independent House for Sale: East Facing 184yds 2BHK at Jedcharla M: 9886154400

SERVICES

BUSINESS OFFER
- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710
- ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468

NAME CHANGE
- I, M.జమదగ్ని యాదవ్ S/o పెద్ద నాగన్న, వయస్సు39 సం॥లు, వృత్తి:వ్యవసాయం, ఇ.నం. 2-57, చందాపూర్ గ్రా॥, వనపర్తి మం॥ & జిల్లా. నా పేరు SSCలో M.యమదుగ్గి తండ్రి M.పెద్దనాగన్న గా ఉన్నది. కావున ఈ పేరును M.జమదగ్ని యాదవ్ తండ్రి M.పెద్దనాగన్న గా మార్చబడింది.

WANTED
- రామకృష్ణ గ్రూపు, (TS No.1) VJA, HYD శ్రీమంతులిళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 96038 92233, 62812 08600

- మహబూబ్‌నగర్ జిల్లా సిమ్స్ హాస్పిటల్‌లో PRO, మేనేజర్ & ఎక్స్‌పీరియన్స్ నర్సింగ్ స్టాఫ్ కావలెను. వనపర్తి వాళ్లు అవసరం Call:8886810808, 9603715551.
- ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ ఆ.కా.సు. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డీటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966



గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనల చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుచున్నాము. ప్రకటనదారు తెలిపే రేటు క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - సాక్షి మేనేజర్

